క్లుప్తంగా

అర్హులందరికీ రుణమాఫీ వర్తింపు

నేరడిగొండ: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తిస్తుందని ఏఈవోలు సౌజన్య, మహేందర్, జైపాల్‌లు అన్నారు. శుక్రవారం మండలంలోని వడూర్ గ్రామంలో రైతువేదికలో క్లస్టర్‌కు సంబంధించిన రుణమాఫీ కాని రైతుల వివరాలు సేకరించారు. పట్టా పాస్‌బుక్, ఆధార్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ పత్రాలతో పాటు కుటుంబసభ్యుల ఫొటోలను తీసుకున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

నేరడిగొండ: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని నేరడిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెచ్‌ఈవో పవార్ రవీందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని బుద్దికొండ గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. పలువురికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది శ్రీనివాస్ రెడ్డి, సాయన్న, పంచాయతీ కార్యదర్శి రాజురెడ్డి, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ) కళాశాలలో 4వ విడత ప్రవేశాల కోసం ఈనెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో నమోదు చేసుకున్నవారు మళ్లీ నమోదు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. వివరాలకు 94935 35378 సంప్రదించాలని కోరారు.

సమ్మె విజయవంతం చేయండి

ఎదులాపురం: రాష్ట్రంలోని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల 9, 10 తేదీల్లో టోకెన్ సమ్మెను నిర్వహిస్తున్నట్లు తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ ఓ ప్రకటనలో తెలిపారు. సమ్మెలో భాగంగా రెండు రోజుల పాటు కార్మికులు నల్ల రిబ్బన్లు ధరించి, నిరసన వ్యక్తం చేస్తూ, వంట చేయాలన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

జైనథ్: విద్యార్థినులు చిన్నతనం నుంచే మహిళా సంక్షేమం, సాధికారత కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా మహిళా సాధికారత కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ యశోద అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ విద్యాలయంలో బాల్య వివాహాల నిరోధక చట్టం, వరకట్న నిషేధ చట్టం, గృహహింస చట్టం, హెల్ప్‌లైన్ నంబర్లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారి వీణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

ఆదిలాబాద్: హిందూ సమాజ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఈనెల 8న వినాయక మండపాల నిర్వాహకులు, వ్యాపారస్తులు, యువత, హిందూ సమాజ బంధువులతో నిర్వహించే సమావేశాన్ని విజయవంతం చేయాలని సమితి అధ్యక్షుడు బొంపెల్లి హనుమాండ్లు ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని వినాయక్ చౌక్ శిశు మందిర్లో ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు.

ఆర్థికసాయం

సిరికొండ: ఇటీవల మండల కేంద్రానికి చెందిన గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్ దాసరి శ్రీనివాస్ ఇటీవల మృతి చెందడంతో గ్రామస్తులు విరాళాలు సేకరించి శ్రీనివాస్ కూతురు మేఘన పేరున రూ. 30 వేలను బ్యాంకులో శుక్రవారం ఫిక్స్ డిపాజిట్ చేశారు. దాసరి శ్రీనివాస్ కుటుంబానికి ఆపద్బాంధు ఫౌండేషన్ వారు నిత్యావసర సరుకులు అందజేశారు. పెంటన్న, చందు, మల్లేష్, రంజాన్, దత్తు, గంగాధర్, అలం, విజయ్, విలాస్ పాల్గొన్నారు.

'ప్రభుత్వం విఫలం'

ఆదిలాబాద్: మహిళలపై పెరుగుతున్న అఘాయిత్యాలను నియంత్రించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని జిల్లా బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు ధోని జ్యోతి అన్నారు. జైనూర్‌లో ఆదివాసీ మహిళపై జరిగిన హత్యాయత్నానికి నిరసనగా శుక్రవారం నిరసన చేపట్టారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి కలెక్టరేట్ చౌక్‌లో ఆందోళన చేశారు. నేరాల నియంత్రణలో పోలీసు శాఖ వైఫల్యం చెందిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించండి

నార్నూర్: భారీ వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో పారిశుధ్యం, క్లోరినేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎల్‌పీవో ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జీసీసీ పెట్రోల్‌బంక్ వద్ద గుట్టపై నుంచి రోడ్డుపైకి వస్తున్న వర్షపు నీటిని పరిశీలించారు. నీటి సరఫరా నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీవో స్వప్నశీలను ఆదేశించారు. జీసీసీ డీఎంకు పైపులైన్ కోసం లేఖ రాయాలని సూచించారు. గ్రామ పంచాయతీ వర్కర్ల ద్వారా ఎప్పటికప్పుడు పనులు చేపట్టాలని అన్నారు. నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఎంపీవో స్వప్నశీల, పంచాయతీ కార్యదర్శి మోతిరాం, రంజిత్ పాల్గొన్నారు.

గిరిజనుల ఆధార్ కష్టాలు..!

- గాదిగూడలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్
- ప్రతీ చిన్న పనికి 25 కిలోమీటర్లు వెళ్లాల్సిందే



గాదిగూడ తహసీల్దార్ కార్యాలయం

నార్నూర్: ప్రస్తుతం ప్రజలకు సంబంధించి అన్నిరకాల అవసరాలు తీర్చడంలో ఆధార్ కీలకంగా మారింది. ప్రభుత్వ పథకాలకు, గుర్తింపు పరమైన కార్డుల జారీకి దీనినే ప్రామాణికంగా తీసుకుంటున్నారు. ఒక్కమాటల్లో చెప్పాలంటే ఏ పని కావాలన్నా ఆధార్ కార్డు ఉండాల్సిందే. గ్యాస్, ఈ–కేవైసీ, ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీ లబ్ధి తదితరాల నేపథ్యంలో కొన్ని నెలలుగా ఆధార్ కేంద్రాలకు ప్రజలు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. పట్టణాలు, పల్లెల నుంచి తెల్లవారుజాము నుంచే కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. అటువంటి కీలక సేవలు గత ప్రభుత్వం పాలన సౌలభ్యం కోసం ఏర్పాటు చేసినా.. గాదిగూడ నూతన మండల కేంద్రంలో ఆధార్ కేంద్రంలో లేకపోవడంతో ప్రజలు తిప్పలు తప్పడం లేదు.

ఆధార్ కేంద్రం కీలకం..

గాదిగూడ మండలంలో మొత్తం 25 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. దాదాపు 20 వేల పైగా జనాభా ఉంది. గాదిగూడ మండల కేంద్రంతో పాటు, లోకారి(కె)లో ప్రవేట్ ఆన్‌లైన్ సెంటర్ ఏర్పాటుచేసి ఆధార్ అప్‌డేట్ చేసి అధిక డబ్బులు వసూలు చేస్తున్నారు. ఆదివాసీ గిరిజనులు ఇబ్బంది పడుతున్న అధికారులు పట్టించుకోవడం లేదు. మండల కేంద్రంలో ఆధార్ కేంద్రం లేకపోవడంతో దాదాపు 25 కిలోమీటర్ల దూరంలో ఉన్నటువంటి నార్నూర్ మండల కేంద్రానికి వచ్చి పని చేసుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. ప్రతిరోజు 100కు పైగా ఆధార్ కార్డు పని నిమిత్తం కేంద్రానికి తరలిరావడంతో బారులు కట్టాల్సిన పరిస్థితి. రోజు కొంతమంది పనులే పూర్తి అవుతున్నాయి. మిగిలిన వారు మరుసటి రోజు మళ్లీ రావాల్సి వస్తోంది. అప్పుడప్పుడు లాగిన్ సమస్య ఉండడంతో పనులు కాక తిరిగి ఇళ్లకు వెళ్లిపోతున్నారు. ఖరీఫ్ పనులు బిజీబిజీ ఉన్న ఆదివాసీ గిరిజనులు ఆధార్ కార్డు పనుల కోసం తిరగడంతో ఇబ్బంది పడుతున్నారు. ఆదివాసీ గిరిజనుల దృష్టిలో పెట్టుకొని గాదిగూడ మండల కేంద్రంలో శాశ్వత ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆధార్ కార్డులో మార్పు కోసం..

ప్రస్తుతం ఆధార్ కార్డు లేకుండా ఏ పని జరగడం లేదు. నూతన ఆధార్ కార్డు కోసం, పిల్లల ఆధార్ అప్‌డేట్ కోసం పాత కార్డులో ఉన్న జిల్లాలు, రాష్ట్రాల పేర్లు మార్పు కొనేందుకు, తప్పులు సరిదిద్దుకోవడం, రేషన్ దుకాణాల్లో, ఉపాధి పనుల్లో, వేలిముద్రలు పడని వారు, ఫోన్ నెంబర్ అనుసంధానం, నూతన వధువు ఇంటిపేరు మార్పిడి కోసం ఆధార్ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం



మండలంలో ఆధార్ కేంద్రం లేదు. ఆధార్ పని కోసం నార్నూరు మండల కేంద్రానికి లేదా జిల్లా కేంద్రానికి వెళ్తున్నారు. ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. మండల కేంద్రంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపించడం జరిగింది.

– విజయనందం, తహసీల్దార్, గాదిగూడ

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఇంద్రవెల్లి: భారీ వర్షాల కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకుంటామని, ఎవరు అధైర్యపడొద్దని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. పంట నష్టం వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో కోతకు గురైన రోడ్లను, వంతెలను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భారీ వర్షాలకు దెబ్బన రోడ్లు, కోతకు గురైన కల్వర్టులు, వంతెనలకు మరమ్మతులు చేయిస్తామన్నారు. అదేవిధంగా భారీ వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక తయారు చేస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ముఖడే ఉత్తం, మసుద్, నాగోరావ్, మహ్మద్ జహిర్, జితెందర్, వసంత్‌రావ్ పాల్గొన్నారు.

రవాణా సౌకర్యం మెరుగుపరుస్తాం

సిరికొండ: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మర్మతులు చేపట్టి రవాణా సౌకర్యాలు మెరుగుపరుస్తామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని తిమ్మాపూర్, లచ్చిపూర్ (కె) గ్రామాల్లో పర్యటించిన ఆయన వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను పరిశీలించారు. సిరికొండ నుంచి వాయిపేట్ వరకు గల రోడ్డుకు గ్రావెలింగ్ మంజూరు చేయించి, భూమి చేసి పనులు ప్రారంభించారు. పాఠశాల భవనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు, ప్రజలకు పాల్గొన్నారు.

హింసాత్మక ఘటనలకు దూరంగా ఉండాలి

ఉట్నూర్‌రూరల్: ఆదివాసీ యువతను హింసాత్మక ఘటనలకు దూరంగా ఉండాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గ్రామపటేళ్లతో సమావేశం నిర్వహించారు. బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు యువతను రెచ్చగొడుతుందన్నారు. ఆదివాసీలు సంయమనం పాటించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామపటేళ్లు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించాలి



ఎమ్మెల్యేకు మట్టి విగ్రహం అందజేస్తున్న సభ్యులు



విద్యార్థులు తయారు చేసిన మట్టి విగ్రహాలు

ఆదిలాబాద్: వినాయక చవితిని పురస్కరించుకొని మట్టి వినాయక విగ్రహాల ప్రతిష్ఠాపనకు ప్రాధాన్యతనివ్వాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో శుక్రవారం సనాతన హిందూ ఉత్సవ సమితి సభ్యులు మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమానికి ఆహ్వానం అందించారు. ఇళ్లలో మట్టి వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించడం శుభ పరిణామం అన్నారు. సమితి జిల్లా అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, గెడమ్ మాధవ్, రేణికుంట్ల రవీందర్, పరమేశ్వర్ పాల్గొన్నారు.

- జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల విద్యార్థినిలు శుక్రవారం మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ ఆధ్వర్యంలో విద్యార్థులు మట్టి ప్రతిమలను తయారు చేశారు. అనంతరం విద్యార్థులు స్థానిక హెడ్ పోస్టాఫీస్‌లో అధికారులు, సిబ్బందికి వారు తయారు చేసిన ప్రతిమలను అందించారు.
- వినాయక చవితిని పురస్కరించుకొని పర్యావరణహిత విగ్రహాలను ప్రతిష్ఠించాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ప్రణీత అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల– 2లో శుక్రవారం విద్యార్థులకు నిర్వహించిన మట్టి విగ్రహాల తయారీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మట్టి వినాయక విగ్రహాల తయారీపై కార్యాశాల ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

మట్టి విగ్రహాల పంపిణీ..

బోథ్: మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మట్టితో చేసిన గణపతి విగ్రహాలను ఎంపీడీవో జీవన్ రెడ్డి శుక్రవారం మహిళా సంఘాల సభ్యులకు అందజేశారు. పర్యావరణాన్ని రక్షించాలనే ఉద్దేశంతో ఐకేపీ ద్వారా చేసిన విగ్రహాలను తయారు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఎం మాధవ్, ఏపీవో జగ్దేరావ్, ప్రమీల, లక్ష్మి పాల్గొన్నారు.

సిరికొండ: మండలంలోని మండల గ్రామీణాభివృద్ధి సమఖ్య కార్యాలయంలో మట్టి గణపతి ప్రతిమలను శుక్రవారం పంపిణీ చేశారు. కార్యాలయ సీసీ లక్ష్మణ్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ మట్టి వినాయకులను పూజించాలని కోరారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జైనథ్: మండలంలోని గిమ్మ జెడ్పీ ఉన్నత పాఠశాలలో వినాయక మట్టి విగ్రహాల తయారీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మజ, సైన్స్ ఉపాధ్యాయుడు ప్రమోద్ కుమార్ విద్యార్థులతో కలిసి విగ్రహాలు తయారు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల వాడకం వల్ల పర్యావరణానికి తీవ్ర హానీ కలుగుతుందని, ప్రతిఒక్కరూ మట్టి గణపయ్యలను పూజించాలన్నారు. అనంతరం మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు.

ఆసుపత్రి భవనాన్ని త్వరగా నిర్మించాలి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బోథ్: బోథ్ మండల కేంద్రంలోని సీహెచ్‌సీ ఆసుపత్రి భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం ఆసుపత్రిని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రోగులతో మాట్లాడారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. బీఆర్‌ఎస్ హయాంలో బోథ్ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా మార్చామని ఇందుకోసం టెండర్లు వేసి నిర్మాణ పనులను మొదలు పెట్టమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్మాణ పనులు ఆగిపోయాయన్నారు. అనంతరం మండల కేంద్రంలో బోడ రాజమణి మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి, తక్షణ సాయంగా రూ. 5వేలు అందించారు.

న్యాయం చేయాలని ఎమ్మెల్యేకు వినతి

సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో పార్ట్ టైం ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించే తమను అకారణంగా విధుల నుంచి ప్రభుత్వం తొలగించిందని, తమకు న్యాయం చేసేలా చూడాలని శుక్రవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు వినతిపత్రం అందించారు. నేరడిగొండ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆయనును కలిసి తమ సమస్యలను విన్నవించారు.

ఆర్థికసాయం..

తాంసి: ప్రమాదవశాత్తు మృతి చెందిన మత్స్యకారుల కుటుంబాలకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆర్థికసాయం అందజేశారు. మండలంలోని బండల్ నాగపూర్ గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన విజయ్, ఆకాష్, అక్షయ్ గత పది రోజుల క్రితం పొచ్చర వాగులో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందారు. ఆపన్నహస్తం కోసం వారి కుటుంబసభ్యులు శుక్రవారం నేరడిగొండలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కలిసి తమ గోడును వినిపించారు. తక్షణ సాయం కింద బోథ్ ఎమ్మెల్యే ఒక్కొక కుటుంబానికి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కలెక్టర్‌తో మాట్లాడి తమ కుటుంబానికి ఉపాధి కల్పించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

కైలాస్‌నగర్: పరిసరాల శుభ్రత పాటించాలని సామాజిక వేత్త మానిష్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని టీచర్స్ కాలనీలో మున్సిపల్ సిబ్బందితో కలిసి పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. వర్షాలు కురుస్తున్నందున ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఖాళీ ప్రదేశాల్లో, వర్షపు నీరు నిల్వ ఉన్న చోట బ్లీచింగ్ పౌడర్ చల్లారు.

వైద్య శిబిరం

నార్నూర్: గాదిగూడ మండలంలోని లోకారి(కె), ఖురుకుంగూడ, రాజులగూడ గ్రామాల్లో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఝరి పీహెచ్‌సీ వైద్యాధికారి రోగులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగ్యూ, విషజ్వరాలు వచ్చే అవకాశం ఉందన్నారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట హెచ్‌ఎస్ అడే సంజయ్, హెచ్‌ఈ రవీందర్ పాల్గొన్నారు.

ఘనంగా హర్తాళికా తీజ్

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠంలో శుక్రవారం హర్తాళికా తీజ్ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకుడు శశిభూషన్ పాండే మహారాజ్ వ్రత కథను వివరించారు. భద్రపద మాసం శుక్లపక్షం తృతీయ తిథినాడు ప్రారంభమై చతుర్థి తిథి ప్రారంభంలో వ్రత ఉపవాసం ముగించడం జరుగుతుందన్నారు. యువతులు మంచి వరుడు లభించాలని పార్వతి పరమేశ్వరులను కొలుస్తారని అన్నారు.

విశ్వవిద్యాలయ ఆవిర్భావ దినోత్సవం

ఎదులాపురం: ఆదిలాబాద్ కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం 10వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు గత పది సంవత్సరాలలో వ్యవసాయం అభివృద్ధి చెందిన విధానాన్ని రైతులకు వివరించారు. కృషి విజ్ఞాన కేంద్రం రైతులకు ఎంతగానో తోడ్పాటు అందించిందన్నారు. ఆదాయాన్ని పెంచడంలో ఎంతగానో కృషి చేసిందని పేర్కొన్నారు. శాస్త్రవేత్తలు రాజశేఖర్, మోహన్‌దాస్, పోశాద్రి, శివ చరణ్, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పాడిపరిశ్రమ ఉత్పత్తులతో ఆదాయం

తాంసి: వ్యవసాయంతో పాటు పశువుల పెంపకం, పాడి ఉత్పత్తులతో మహిళలు ఆదాయం సంపాదించవచ్చని విజయ డెయిరీ డీడీ మధుసూదన్ అన్నారు. శుక్రవారం భీంపూర్ మండల కేంద్రంలోని రైతువేదికలో మహిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పొదుపు సంఘాల మహిళలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం కల్పిస్తున్న వివిధ పథకాలను మహిళలు అందిపుచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మహిత ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీకాంత్, బ్యాంకు మేనేజర్ పల్లవి, ఐకేపీ ఏపీఎం ప్రసాద్, ప్రవీణ్, ఆదర్శ్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

తాంసి: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని జిల్లా ఐసీడీఎస్ పీడీ సబిత అన్నారు. శుక్రవారం భీంపూర్ మండల కేంద్రంలో పోషణ అభియాన్‌లో భాగంగా పోషణ మాసోత్సవాన్ని నిర్వహించారు. భీంపూర్, అర్లి(టి) సెక్టార్‌కు సంబంధించి పంచాయతీ కార్యాలయ ఆవరణలో వివిధ స్టాళ్లను ఏర్పాటు చేశారు. కూరగాయాలు, పప్పులు, తృణధాన్యాల స్టాళ్లను పీడీ అధికారులతో కలిసి పరిశీలించారు. పోషణ మాసోత్సవ పోస్టర్ ఆవిష్కరించారు. అంగన్‌వాడీలతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏసీడీపీవో నర్సమ్మ, వైద్యాధికారి నిఖిల్‌రాజ్, మండల సూపర్‌వైజర్ ముంతాజ్, రాధ, అంగన్‌వాడీలు వెంకటమ్మ, నజీమా, సవిత పాల్గొన్నారు.

- తాంసి మండల కేంద్రంలో పోషణ అభియాన్‌లో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాన్ని నిర్వహించారు. గ్రామ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీడీపీవో సురేఖ హాజరయ్యారు. కూరగాయాలు, పప్పు దినుసులతో కూడిన స్టాళ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ గౌరిరాణి, మండల వైద్యాధికారి శ్రావ్యవాణి, కృష్ణ, రామన్న యాదవ్, అంగన్‌వాడీ టీచర్లు సరితా రెడ్డి, రూప,గంగమ్మ, దేవమ్మ, నర్సమ్మ పాల్గొన్నారు.

నిందితుడిని ఉరితీయాలి

ఎదులాపురం: జైనూరు మండలంలో ఆదివాసీ మహిళపై అత్యాచారయత్నం చేసిన వ్యక్తిని ఉరితీయాలని తుడుందెబ్బ డివిజన్ అధ్యక్షుడు కుమ్ర జంగు పటేల్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం మాట్లాడారు. మహిళపై అఘాయిత్యానికి ఒడిగట్టిన వ్యక్తిని చట్టపరంగా శిక్షించాలన్నారు. అక్రమాలకు పాల్పడుతున్న అక్కడి వర్గాలను అక్కడి నుండి పంపించివేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తుడుం దెబ్బ నాయకులు మనోహర్, భారత్, గణపతి, కేశవ్ పటేల్, రాము పాల్గొన్నారు.

బోథ్: జైనూర్‌లో ఆదివాసీ మహిళపై అత్యాచారం చేసి, హత్య చేయాలని చూసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని ఆదివాసీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని సొనాల గ్రామంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో పార్డి సార్‌మెడి తొడసం లక్ష్మణ్, మారుతి, కిషన్, మెస్రం భూమన్న, భగవాన్, లాలూరామ్, జాకేష్ పాల్గొన్నారు.

బంద్ ప్రశాంతం

- పరిస్థితిని సమీక్షించిన ఎస్పీ గౌస్ ఆలం
- పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన శాంతిభద్రతల అదనపు డీజీపీ మహేశ్ భగవత్



ఇంద్రవెల్లి: దుకాణాలను బంద్ చేసిన వ్యాపారులు



ఇచ్చోడ: ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

ఇచ్చోడ/గుడిహత్నూర్/ఇంద్రవెల్లి/బజార్‌హత్నూర్: ఆదివాసీ సంఘాలు శుక్రవారం నిర్వహించిన బంద్ ఇచ్చోడ, గుడిహత్నూర్, బజార్‌హత్నూర్ మండలాల్లో విజయవంతమైంది. పోలీసులు ముందుస్తుగా జాగ్రత్తలు తీసుకున్నారు. ఇచ్చోడ మండల కేంద్రంలో వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారు. నిర్మల్, ఆదిలాబాద్ బైపాస్, సిరికొండ, సిరిచెల్మ రోడ్ల వద్ద పోలీస్ పికెటింగ్‌లు ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలో ప్రధాన విధుల గుండా ఆర్‌ఐ నగేశ్, ఇచ్చోడ సీఐ భీమేశ్ ఆధ్వర్యంలో ప్రత్యేక దళాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ గౌస్ ఆలం పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించారు. బజార్‌హత్నూర్ మండల కేంద్రంలో వ్యాపారులు బంద్‌లో స్వచ్ఛందంగా పాల్గొన్నారు. స్థానిక ఎస్సై అప్పారావు గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. గుడిహత్నూర్ మండల కేంద్రంలో ఉట్నూర్ ఎక్స్‌రోడ్డు వద్ద పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశారు. ఎస్సై బందోబస్తు నిర్వహించారు. ఇంద్రవెల్లి మండల కేంద్రంలో బంద్ పాక్షికంగా జరిగింది. ఉదయం పూట వ్యాపారులు దూకాణలను మూసివేశారు. మధ్యాహ్నం తెరవడంతో బంద్ పాక్షికంగా జరిగింది. ఎస్సై సునీల్ శాంతిభద్రతలను పర్యవేక్షించారు.

ఇచ్చోడ పోలీస్‌స్టేషన్‌కు అదనపు డీజీపీ..

శాంతిభద్రతల అదనపు డీజీపీ మహేశ్ భగవత్ శుక్రవారం సాయంత్రం ఇచ్చోడ పోలీస్‌స్టేషన్ చేరుకొని జిల్లా ఎస్పీ గౌస్ ఆలంతో కలిసి పరిస్థితిని సమీక్షించారు. జిల్లా ఎస్పీతో పాటు, పోలీసులకు పలు ఆదేశాలు జారీ చేశారు.

సంక్షిప్త వార్తలు

పరామర్శ

గుడిహత్నూర్: కాంగ్రెస్ పార్లమెంటరీ కోఆర్డినేటర్ నరేశ్ జాదవ్ పెద్దనాన్న చందూ నాయక్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ శుక్రవారం తోషంతండాకు చేరుకొని బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.

ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపికవడం కళాశాలకే గర్వకారణం

ఇచ్చోడ: రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుడిగా కళాశాలకు చెందిన అధ్యాపకుడు వెల్మల మధు ఎంపిక కావడం కళాశాలకే గర్వ కారణమని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అన్నారు. రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుడిగా అవార్డు అందుకున్న మధుకు శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సత్కరించారు. నూతనంగా ప్రారంభమైన కళాశాల నుంచి రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుడిగా అధ్యాపకులు సరస్వతి , కట్కం మురళీ, దయాకర్, సరితా రాణి, తిరుపతి, నర్సయ్య, సుభాష్ పాల్గొన్నారు.

యువకుల శ్రమదానం

తాంసి: మండల కేంద్రంలోని విద్యానగర్ కాలనీల్లో రోడ్డుపై అడ్డంగా భారీ గుంత ఏర్పడింది. రోడ్డుపై గుంత ఏర్పడడంతో వచ్చి, వెళ్లే వారికి ఇబ్బందిగా మారింది. దీంతో కాలనీ యువకులు శుక్రవారం శ్రమదానం చేశారు. యువకులు సృజన్, సాయి, శ్రీకాంత్, గజానన్, రాజు పాల్గొన్నారు.

వ్యాపారులకు కృతజ్ఞతలు

ఇచ్చోడ: ఆదివాసీ మహిళపై అత్యాచారం చేసిన నిందితుడిని ఉరి తీయాలని డిమాండ్ చేస్తూ.. ఇచ్చిన బంద్‌కు సహకరించిన వ్యాపారులకు ఆదివాసీ సంఘాల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆదివాసీ భవన్‌లో మాట్లాడారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు కుంర కోటేశ్, పెందుర్ తుల్సిరాం, దేవురావు కాత్లే విఠల్, నైతం వెంకటేశ్, భీంరావు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడి నియామకంపై హర్షం

కైలాస్‌నగర్: టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడిగా బి.మహేశ్ కుమార్‌గౌడ్‌ను నియమించడంపై కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో మహేశ్‌కుమార్ గౌడ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువాతో సన్మానించారు.

కాంగ్రెస్‌లో చేరిక

కై లాస్‌నగర్: ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని యాపల్‌గూడ, కొత్తగూడ గ్రామస్తులు అల్చెట్టి నాగన్న, మామిళ్ల భూమన్న ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ చేరారు. భుక్తాపూర్‌కు చెందిన పలువురు కాలనీవాసులు సైతం శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రజా సేవ భవన్‌లో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరగా, వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

చైర్మన్‌ను తొలగింపుపై హర్షం

బోథ్: బోథ్ ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ పదవి నుంచి కదం ప్రశాంత్‌ను తొలగించడంపై పీఏసీఎస్ డైరెక్టర్లు గొర్ల రాజు యాదవ్, చట్ల ఉమేష్, లోలపు పోశెట్టి, ద్యాగాల నారాయణలు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం వారు మాట్లాడుతూ.. ఇష్టారీతిని నిర్ణయాలు తీసుకుంటూ.. ఎలాంటి సమావేశాలను నిర్వహించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారని, అందుకే అధికారులు ఫిర్యాదు చేశామని తెలిపారు.

పారిశుధ్య పనుల పర్యవేక్షణ

బోథ్: మండలంలోని కౌఠ(బి) గ్రామంలో ఎంపీడీవో జీవన్ రెడ్డి పారిశుధ్య పనులను శుక్రవారం పర్యవేక్షించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల వద్ద పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. అనంతరం పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

జీవాలకు టీకాలు

నేరడిగొండ: జీవాలకు టీకాలు వేయించాలని పశువైద్యాధికారులు రాథోడ్ జీవన్, సుశీల్ కుమార్‌లు అన్నారు. శుక్రవారం మండలంలోని సుర్దాపూర్, తర్నం(బి), ఇస్పూర్ గ్రామాల్లో టీకాల కార్యక్రమం నిర్వహించారు. మేకలు, గొర్రెలకు వివిధ వ్యాధులు సోకే ప్రమాదం ఉంటుందన్నారు. రైతులు పశువులకు టీకాలు వేయించాలని సూచించారు.

ఇన్‌స్పైర్ నామినేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న డీఈవో ప్రణీత

ఎదులాపురం: ఇన్‌స్పైర్ నామినేషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని మండల, జిల్లాస్థాయి టెక్నికల్ కమిటీలకు జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ నం.2లో శుక్రవారం జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ మనక్ నామినేషన్ కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి పాఠశాల నుంచి ఐదు నామినేషన్లు సమర్పించేలా చూడాలన్నారు. అనంతరం జిల్లా సైన్స్ అధికారి రఘు రమణ, అదనపు సైన్స్ అధికారి భాస్కర్, రిసోర్స్ పర్సన్ నిఖిలేష్‌లు నామినేషన్ ప్రక్రియ, ఇతర సాంకేతిక అంశాలను గురించి వివరించారు.